

ఇస్రోలో మంచిర్యాల శాస్త్రవేత్త


శాస్త్రవేత్త చంద్రశేఖర్

మంచిర్యాలటౌన్: చంద్రయాన్–3 ప్రయోగంలో మంచిర్యాల చెందిన శాస్త్రవేత్త మల్యాల చంద్రశేఖర్ పాలుపంచుకున్నారు. మంచిర్యాలలో నివాసం ఉంటూనే 18ఏళ్లుగా ఇస్రోలో శాస్త్రవేత్తగా చేస్తున్న ఆయన ప్రస్తుతం త్రివేండ్రం ఇస్రోలో శాస్త్రవేత్తగా ఉన్నారు. చంద్రయాన్–3 కోసం పని చేస్తున్న శాస్త్రవేత్తల్లో ఒకరిగా చంద్రశేఖర్ నిలవడం గర్వకారణమని మంచిర్యాల ఆర్యవైశ్య సంఘం, యువజన వైశ్య సంఘం నాయకులు అభినందించారు.

గరిష్టం/కనిష్టం
33.0 /26.0

వాతావరణం

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది.

అద్భుతం.. చంద్రయాన్

మంచిర్యాలఅర్బన్: దేశ అంతరిక్ష ప్రయోగంలో మరిచిపోలేని ఘట్టం ఆవిష్కృతమైంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) శుక్రవారం శ్రీహరి కోట నుంచి చంద్రయాన్–3ను ప్రయోగించింది. చందమామ గుట్టును పట్టేందుకు ప్రయోగిస్తున్న చంద్రయాన్–3 ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకుంది. ఎల్‌వీఎం–3 రాకెట్ ద్వారా అంతరిక్ష నౌక గగన తలంలోకి దూసుకెళ్లింది. ఈ అద్భుత దృశ్యాలను పెద్దల నుంచి చిన్నారుల వరకు డిజిటల్ తెర, టీవీల్లో ఆసక్తిగా వీక్షించారు. చంద్రయాన్–3పై తమ అభిప్రాయాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు 'సాక్షి'తో పంచుకున్నారు.

- విద్యార్థుల మనోగతం
- నేల నుంచి నింగిలోకి రాకెట్

సంతోషం చెప్పరానిది



ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్–3 విజయవంతం కావాలి. చంద్రుడి మీద మంచినీళ్లు దొరకబట్టిన ఘనత మనకే దక్కాలి. చంద్రయాన్ ప్రయోగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూస్తుంటే సంతోషం మాటల్లో చెప్పరానిది.

– సీహెచ్.కమల్, 9వ తరగతి, దేవులవాడ స్కూల్, కోటపల్లి

జాబిల్లిపైకి వెళ్తుంటే సంబరం



అమ్మమ్మ చిన్నప్పుడు చెప్పిన కథల్లోని చందమామ మీదికి చంద్రయాన్ ప్రయోగం ద్వారా రాకెట్‌ను పంపిస్తుంటే చాలా సంబురం వేసింది. మానవుడు నివసించడానికి వీలైన వాతావరణం ఉందో..? లేదో తెలుసుకోవడం వీలవుతుంది. సుమారు 40 రోజులు జరిగే ప్రయోగం విజయవంతం కావాల ని, అక్కడ మానవ సమాజం నివసించుటకు అనువైన వాతావరణం ఉంటుందని ఆశిస్తున్నాను.

– విశ్వర్షిత, 9వ తరగతి, దేవులవాడ

కొత్త అనుభూతి..



నింగిలోకి వెళ్లుతున్న చంద్రయాన్–3 వీక్షిస్తుంటే కొత్త అనుభూతి కలిగింది. నేను కూడా శాస్త్రవేత్తను అయితే ఎంత బాగుండు అనిపించింది. డిజిటల్ తెరపై వీక్షించిన తర్వాత శాస్త్రవేత్తగా ఎదిగాలనిపిస్తుంది. సైంటిస్టుగా అయ్యేందుకు లక్ష్యాన్ని పెట్టుకుని చదువుతాను.

– అశ్విత, భీమారం స్కూల్, పదో తరగతి

శాస్త్రవేత్తను అయితే బాగుండు..



చంద్రయాన్–3 లాంచింగ్ విజయవంతమైనందుకు సంతోషంగా ఉంది. శాస్త్రవేత్తలు పడిన శ్రమకు ఫలితం దక్కింది. భారతదేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకుని వెళ్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు అభినందనీయులు. ఇప్పటి వరకు రెండు సార్లు శ్రీహరికోటకు వెళ్లాను. అక్కడి పరిసరాలు, వాతావరణం చూస్తుంటే నేను కూడా శాస్త్రవేత్తను అయితే బాగుండు అనిపించింది. అక్కడే శాస్త్రవేత్తలు పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ ఆపరేషన్ సిస్టంపై చక్కగా వివరించారు.

– కె.శ్రీరాంమూర్తి, ఇస్రో సందర్శించిన టీచర్, జెడ్పీఎస్ఎస్, భీమారం

చందమామపై కాలుమోపే రోజులు రావాలి..



అంతరిక్ష చరిత్రలో భారత పతాకం మరోసారి రెపరెపలాడుతుంది. 25గంటల కౌంట్‌డౌన్ తర్వాత బహుబలి ఎల్ఎంవీ–3 ఎం4 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకుపోయింది. ఇస్రో చేపట్టిన చంద్రయాన్ త్రీ విజయవంతం చేసినందుకు ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రత్యేక అభినందనలు. ఇస్రో ఘన కీర్తిని జిల్లాలోని విద్యార్థులందరికీ ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు డీఈవో యాదయ్య ఆదేశానుసారం ఏర్పాట్లు చేయటం జరిగింది. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో భారతీయులు చందమామపై కాలుమోపే రోజులు రావాలని కోరుకుంటున్నా.

– మధుబాబు, జిల్లా సైన్స్ అధికారి

భారత్‌కు గర్వకారణం..



సినిమాను నిర్మించే బడ్జెట్‌తో చంద్రయాన్ ప్రయోగం నిర్వహించడం భారత్‌కు గర్వకారణం. సైకిల్‌పై రాకెట్ తీసుకెళ్లి లాంచ్ చేసిన ఇస్రో నేడు చంద్రయాన్–3 ప్రయోగం నిర్వహించారు. గతంలో జిల్లా ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులతో కలిసి ఇస్రోను సందర్శించాను. ఈ రోజు చంద్రయాన్–3 ప్రయో గం మాకళ్ల ముందే నిర్వహించిన అనుభూతి కలిగించింది. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం కలిగించటానికి ఈ రోజు మా పాఠశాల విద్యార్థులకు ఈ ప్రయోగాన్ని లైవ్‌లో చూపించటం జరిగింది.

– జాకీర్ హుస్సైన్, ఇస్రో సందర్శించిన టీచర్

శాస్త్రవేత్తల శ్రమ ఎంతో..



చంద్రయాన్–3 టీవీలో లైవ్ ద్వారా కార్యక్రమాన్ని చూశాను. 40 రోజులు ఎప్పుడు గడుస్తాయని అని ఎదురుచూస్తాను. చంద్రయాన్–3 పొగలు కక్కుతూ ఆకాశం వైపు వెళ్తుంటే శాస్త్రవేత్తలు ఎంత కష్టపడ్డారో ఈ రోజు వీక్షిస్తే నాకు అర్థమైంది. వీరి శ్రమను చూసి పదో తరగతి నేను చాలా కష్టపడి 10జీపీఏ సాధిస్తాను. రాబోయే రోజుల్లో ఒక గొప్ప శాస్త్రవేత్త అవుతాను.

– విజయ్‌కుమార్, పదో తరగతి, భీమారం స్కూల్

ఇస్రో సందర్శన



ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు శ్రీహరికో టలోని ఇస్రోను సందర్శించారు. 2017లో 50 మంది ఉపాధ్యాయులు ఇస్రో లాంచింగ్ స్టేషన్, లాంచింగ్ ప్యాడ్‌లను భారత దేశం నింగిలోకి పంపిన వివిధ రకాల రాకెట్లు, రోవర్లను స్వయంగా వీక్షించి అద్భుత జ్ఞానాన్ని పొందారు.


చంద్రయాన్–3 వీక్షిస్తున్న దేవులవాడ పాఠశాల విద్యార్థులు

న్యూస్‌రీల్

కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం


మాట్లాడుతున్న గోమాస శ్రీనివాస్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌లోని ఎస్‌వీఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గోమాస శ్రీనివాస్, మాజీ మంత్రి గడ్డం వినోద్‌తోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా నియోజకవర్గాల నుంచి పలువురు నాయకులు హాజరయ్యారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పనిచేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. సీనియర్ నాయకులు కేవీ.ప్రతాప్, మాజీ జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య, టీపీసీసీ కార్యదర్శి వొడ్నాల శ్రీనివాస్, సరస్వతి, భరత్‌చౌహాన్, గజేందర్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల పార్టీలో చేరిన మంచిర్యాలకు చెందిన డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావును సన్మానించారు.

మున్సిపల్ వాహనం సీజ్


ఆర్టీసీ డిపోలో వాహనం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీకి రూ.కోట్లు పన్నుల రూపంలో వస్తుండగా, ప్రభుత్వం నుంచి పట్టణ ప్రగతి పేరిట ప్రతి నెల రూ.లక్షల్లో నిధులు విడుదల చేస్తున్నారు. ఈ నిధులతోనే అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు అవసరమైన వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. విద్యుత్ దీపాలు అమర్చడం, మరమ్మతులు చేయడం, ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను విద్యుత్ తీగలకు తగలకుండా తొలగించడం వంటి పనులకు ల్యాడర్ వాహనాన్ని గతంలోనే కొనుగోలు చేశారు. ప్రతీ ఏడాది ట్యాక్స్ చెల్లించకపోవడం, ఇన్సూరెన్స్ లేకపోవడంతో వారం క్రితం ఆర్టీఏ అధికారులు వాహనాల తనిఖీల్లో ల్యాడర్ వాహనాన్ని సీజ్ చేసి మంచిర్యాల ఆర్టీసీ డిపోలో ఉంచారు. ట్యాక్స్, జరిమానా అన్ని కలిపి రూ.1.30 లక్షలు ఆర్టీఏకు చెల్లించాల్సి ఉంది.

నేడు ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీల భర్తీ కోసం ఈ నెల 15న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ స్వరూపరాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు లక్సెట్టిపేట టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికలు, జైపూర్ టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలుర కళాశాలల్లో హాజరు కావాలని తెలిపారు. ఇటీవల మార్చిలో జరిగిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారు మాత్రమే అర్హులని, సప్లిమెంటరీలో పాసైన వారికి అర్హత లేదని తెలిపారు.

పై'చేయి'కి ఎత్తులు!


గద్దెరాగిడిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గోమాస శ్రీనివాస్, మాజీ మంత్రి గడ్డం వినోద్, భరత్ చౌహాన్, కుమురంభీం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, కేవీ ప్రతాప్, నీలకంఠేశ్వరరావు, సరస్వతి, దయానంద్, సత్తయ్య అభివాదం

- కాంగ్రెస్ పార్టీలో అంతర్గత గ్రూపులు
- ఒక్కో వర్గంలో ఒక్కో తీరుగా వ్యవహారం
- తమ వారికే టికెట్లు దక్కేలా ప్రోత్సాహం
- పోటాపోటీగా కార్యక్రమాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీలో వర్గపోరుతో నాయకులు పై'చేయి' సాధించేందుకు పోటీ పడుతున్నారు. పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తూ పట్టు కోసం ప్రయత్నిస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీలో గత కొంతకాలంగా అంతర్గత వర్గపోరు నడుస్తున్న విషయం తెలిసిందే. తాజాగా తామంతా ఒకటేనని తెలియజేస్తూ శుక్రవారం పీసీసీ ప్రధాన కార్యదర్శి గోమాస శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి గడ్డం వినోద్, కుమురంభీం జిల్లా పార్టీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు భరత్‌చౌహాన్, సీనియర్ నాయకులు కేవీ.ప్రతాప్, అడె గజేందర్, ఒడ్నాల శ్రీనివాస్ తదితర నాయకులు, టికెట్ ఆశావహులతో మంచిర్యాలలోని గద్దెరాగిడి సమీపంలో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం పేరిట సమావేశం నిర్వహించారు. ఖానాపూర్, బోథ్, ఆసిఫాబాద్, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల నుంచి పార్టీ టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులతోపాటు కార్యకర్తలు సైతం హాజరయ్యారు. గత కొంతకాలంగా పార్టీలో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావుతో కొందరు సీనియర్ నాయకులు విభేదిస్తున్నారు. తాజాగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం సైతం ఆయన లక్ష్యంగానే సాగినట్లు భావిస్తున్నారు. ఈ సమావేశంతో అధిష్టానానికి, జిల్లా పార్టీ నాయకత్వంలో ఓ సందేశం ఇచ్చేలా నిర్వహించారు.

'పీఎస్సార్'కు చెక్ పెట్టేందుకేనా?

జిల్లా కాంగ్రెస్ పార్టీలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు చెందిన రెండు వర్గాలు కొనసాగుతున్నాయి. ఈ వర్గాల్లో ఒకరి వర్గంతో మరొక వర్గం దూరంగా ఉంటున్నారు. జిల్లాలో 'భట్టి' విక్రమార్క నిర్వహించిన పాదయాత్రకు అన్నీ తానై మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్) వ్యవహరించారు. ఇదే సమయంలో 'భట్టి' యాత్రకు కొందరు సీనియర్లు దూరంగా ఉన్నారు. మరికొందరు అంటీముట్టనట్లు వ్యవహరించారు. ఇక జిల్లాలో మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ఒక్కో వర్గం తమ అనుకూల నాయకులను ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రచారం చేసుకుంటున్నారు. ఒక్కో వర్గంలో ఇద్దరు, ముగ్గురు చొప్పున అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఎవరికి వారు ఎన్నికల ముందు ప్రజల్లోకి వెళ్తూ, వేర్వేరుగానే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరితోపాటు పార్టీలో చేరుతున్న కొత్త వారు, టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులను ప్రోత్సహిస్తున్నారు. పీఎస్సార్ తనకు అనుకూల నాయకులను ఆయా చోట్ల అభ్యర్థులుగా చెబుతున్నారని మరో వర్గం వాదన. ఆయన తన నియోజకవర్గంతోపాటు ఇతర నియోజకవర్గాల్లోనూ అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్లు ఇప్పటికే రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదులు అందాయి. ఇటీవల మాజీ మంత్రి గడ్డం వినోద్, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు చెక్ బౌన్స్ వ్యవహారం సైతం రాజకీయ కోణంలో చూస్తున్నారు. ఇక పీఎస్సార్ వర్గీయులతో వినోద్‌కు వ్యతిరేకంగా బెల్లంపల్లిలో 'లోకల్' అంశం తెరపైకి తెచ్చారనే విమర్శలు ఉన్నాయి. నిరసనలు చేసిన వారికి పార్టీ నుంచి నోటీసులు అందాయి.

'తమ' వారికే మద్దతు

ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీలో తమ అనుకునే వారికే టికెట్లు ఇస్తారని ప్రచారం చేస్తున్నారు. వారికే పార్టీ నుంచి ప్రోత్సాహం ఇస్తున్నారు. దీంతో ఎవరికి వారే తమకే టికెట్ అన్నట్లుగా భావిస్తున్నారు. ఒక్కోచోట ఒక్కో తీరుగా ఉండడంతో ఎవరిని టికెట్ వరిస్తుందో చెప్పలేని పరిస్థితి. అయినప్పటికీ ఎన్నో ఏళ్లుగా పార్టీలో పని చేస్తున్న వారితోపాటు కొత్తగా పార్టీలో చేరుతున్నవారు సైతం టికెట్ ఆశించే పని చేస్తున్నారు. ఏ వర్గంలో ఉంటే టికెట్ వస్తుందోనని బేరీజు వేసుకుని ఆ నాయకుల వెంట నడుస్తున్నారు. పోటాపోటీ కార్యక్రమాలు చేస్తున్నారు. మూడు నియోజకవర్గాల పరిధిలో టికెట్లు కోరుతున్న వారంతా అటు అధిష్టానం దృష్టిలో పడేందుకు, ఇటు ప్రజలు, కార్యకర్తల్లో నాయకులుగా గుర్తింపు పొందేందుకు చెమటోడుస్తున్నారు. చివరకు ఏ వర్గంపై 'చేయి' సాధిస్తుందో వేచి చూడాల్సి ఉంది. ఈ క్రమంలో పార్టీలో గ్రూపులను తొలగించి, పార్టీని బలోపేతం చేయాల్సిందిగా కింది స్థాయి కార్యకర్తలు కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం బీసీ జనగణన చేపట్టాలి


బీసీ సంఘాల నాయకులు

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం బీసీ జనగణన చేపట్టాలని బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై కూర్చుని అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రం త్వరలో చేపట్టబోయే జనగణనలో బీసీల జనగణన సైతం చేపట్టాలని అన్నారు. చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని దేశవ్యాప్తంగా చర్చ ప్రారంభమైందని, జనగణన కాలంలోని పట్టికలో 34కాలమ్‌లు ఉన్నాయని, కులగణన కాలాన్ని చేరిస్తే మరో కాలమ్ మాత్రమే పెరుగుతుందని, దీని కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు అవసరం లేదని పేర్కొన్నారు. కులగణన కాలం చేరిస్తే బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందని పాలకులు భావిస్తున్నారని అన్నారు. బీసీ సంఘాల ఐక్య వేదిక కో కన్వీనర్లు సంగెం లక్ష్మణ్, గజెల్లి వెంకటయ్య, కుమ్మర సంఘం నాయకులు కొత్తపల్లి రమేష్, నాయకులు కంచర్ల కొమురయ్య, తాడూరి శంకర్, రామస్వామి, ఎల్లన్న, జంబోజీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాముని చెరువు సందర్శన

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని రాముని చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులకు గతంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా పని చేసి, ప్రస్తుతం కరీంనగర్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆర్వీ కర్ణన్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ శుక్రవారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆర్వీ కర్ణన్, గతంలో రాముని చెరువు సుందరీకరణ పనులకు రూ.3.50కోట్లు కేటాయించి ఏయే పనులు చేపట్టాలో నిర్ణయించారు. మంచిర్యాలకు వచ్చిన సందర్భంగా పనులు ఏ మేరకు జరిగాయో పరిశీలించి వెళ్లారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్, ట్రెయినీ కలెక్టర్ గౌతమి పాల్గొన్నారు.

సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దుతా

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- అభివృద్ధి పనుల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న విప్ సుమన్

రామకృష్ణాపూర్: సింగరేణిలోనే ఓ ప్రత్యేక గుర్తింపు కలిగిన రామకృష్ణాపూర్ పట్టణాన్ని గత పాలకులు బొందపెట్టాలని ప్రయత్నిస్తే ప్రస్తుత బీఆర్ఎస్ ప్రభుత్వం అదే పట్టణాన్ని నిలబెట్టాలని చూస్తోందని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. పట్టణంలో బ్రహ్మాండమైన అభివృద్ధి చేసి చూపించి సుందరమైన పట్టణంగా ఆర్కేపీని తీర్చిదుద్దుతానని పేర్కొన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆర్కేపీ ఏ జోన్, బీ జోన్ ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఇక్కడ సాగుతున్న పలు అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీఎంఎఫ్‌టీ, టీయూఎఫ్ఐడీసీ నిధులతోపాటు ఇటీవల ముఖ్యమంత్రి ప్రకటించిన ఎస్‌డీఎఫ్ నిధులతో క్యాతనపల్లి పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గాంధారివనంలో శిల్పారామం ఏర్పాటు, పట్టణంలో ప్రధాన జంక్షన్ల అభివృద్ధి, పార్కుల ఏర్పాటు, అంతర్గత రోడ్లు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ తదితర పనులన్నీ త్వరలోనే పూర్తి చేయనున్నట్లు వివరించారు. క్యాతనపల్లి ఆర్వోబీని ఆగస్టు 15కల్లా పూర్తిచేసి ఫ్లై ఓవర్‌తోపాటు పలు నిర్మాణాలను మంత్రి కేటీఆర్ ద్వారా ప్రారంభిస్తామన్నారు. ఆర్కే1ఏ గనిని త్వరలో మూసివేయనున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందని, సింగరేణి సీఎండీతో మాట్లాడి గని జీవితకాలం పెంపునకు కృషి చేస్తానని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ వెంకటనారాయణ, బీఆర్ఎస్ నాయకులు అబ్దుల్‌అజీజ్, గాండ్ల సమ్మయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గుట్టుగా గుట్ట తవ్వకాలు


గుట్టను తొలచి తరలించేందుకు సిద్ధంగా ఉన్న రాళ్లు

- అనుమతులు లేకుండా బండ తరలింపు
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రం మంచిర్యాలలో అన్ని శాఖల అధికారులు ఉంటున్నా.. అక్రమార్కులు గుట్టలను పగులగొట్టి రాళ్లను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎంతో కొంత ముట్టజెప్పుతుండడంతోనే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, గుట్ట తవ్వకాలను అడ్డుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని నెలలుగా ఎలాంటి అనుమతులు లేకుండానే గుట్ట తవ్వకాలు జరుగుతున్నా, ప్రభుత్వ భూమిలోని బండను పట్టపగలే యథేచ్ఛగా కొందరు కూలీలను పెట్టి మరీ ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నా మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులు పట్టనట్లుగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. పాతమంచిర్యాల నుంచి రంగంపేట్‌కు వెళ్లే దారిలో ఆండాళమ్మ కాలనీలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల వెనకాలే అక్రమ క్వారీ నిర్వహణ సాగుతోంది. పాతమంచిర్యాల నుంచి మెయిన్ రోడ్డుకు కూతవేటు దూరంలోనే 131 సర్వే నంబరులో దాదాపు 11 ఎకరాలకు పైగా మొత్తం క్వారీతో నిండిన ప్రదేశమే. ఈ భూమి కొంత అటవీప్రాంతాన్ని ఆనుకుని ఉండడం, పూర్తిస్థాయిలో బండరాళ్లు లేకుండా అక్కడక్కడా మైదానప్రాంతం ఉండడం వల్ల ఇక్కడ బండరాయి ఉన్నట్లుగా కనిపించదు. ఇటీవల మిషన్ భగీరథ పథకంలో భాగంగా తాగునీటి సరఫరాకు వాటర్‌ట్యాంక్ నిర్మించగా, మంచిర్యాల మున్సిపాలిటీ డంపింగ్ యార్డును ఇక్కడే నిర్వహిస్తున్నారు. స్థానికంగా ఉండే కొందరు అధికార పార్టీకి చెందిన వారే ఆ బండరాళ్లను ప్రతీరోజు కూలీలతో రాళ్లుగా మార్చి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. బేస్‌మెంట్‌కు ఉపయోగపడేలా రాళ్లను పగులకొట్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు తీసుకుంటున్నారు. ప్రతీరోజు 10కి పైగా ట్రిప్పులు తరలిస్తుండగా రూ.40 వేల వరకు సంపాదిస్తున్నారు.

అనుమతులు ఇవ్వలేదు

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రంగంపేట్, ఆండాళమ్మ కాలనీలో ఎలాంటి క్వారీకి అనుమతులు ఇవ్వలేదు. ప్రస్తుతం ఆ స్థలం అటవీశాఖ ఆధీనంలో ఉంది. మైనింగ్ శాఖ నుంచి అనుమతులు ఇచ్చేందుకు అవకాశం లేదు.

– బాలు, మైనింగ్ శాఖ అధికారి

క్లుప్తంగా

కారు ఢీకొని వృద్ధుడి మృతి


గురువయ్య(ఫైల్)

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లికి చెందిన వృద్ధుడు గాలిపెల్లి గురువయ్య (60) కారు ఢీకొని మృతి చెందాడు. ఎస్సై కుందారపు అశోక్ వివరాల ప్రకారం... గురువయ్య వ్యక్తిగత పనినిమిత్తం శుక్రవారం ఇంటి నుంచి సైకిల్‌పై బయటకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ముత్యంపేట సమీపంలోని ఫ్లయాస్ బ్రిక్స్ దగ్గర కారు వెనక నుంచి అతివేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గౌరక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ మండలంలోని కిష్టంపేట గ్రామంలో తాగిన మైకంలో భార్య (గాలిపెల్లి శంకరమ్మ)ను హత్య చేసిన భర్త గాలిపెల్లి పోశంను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు చెన్నూర్ పట్టణ సీఐ వాసుదేవరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ... గురువారం ఉదయం భార్యను హత్య చేసి పరారీలో ఉన్న పోశంను కిష్టంపేట శివారు సుద్దాల క్రాస్ రోడ్డు వద్ద అదే రోజు రాత్రి అదుపులోకి తీసుకొని అతడి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన గొడ్డలిని, రక్తపు మరకలు ఉన్న చొక్కాని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టడం జరిగిందని సీఐ తెలిపారు.

బైక్ సీటు కింద పాము


బైక్ సీటు కింది నుంచి వస్తున్న పాము

నెన్నెల: విష పూరిత పాములను దూరం నుంచి చూస్తేనే గుండె గుబేలుమంటుంది. అలాంటిది బైక్‌లో కనిపిస్తే ఇక ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇలాంటి సంఘటనే శుక్రవారం నెన్నెల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగింది. వివరాల్లోకి వెళ్తే...చిత్తాపూర్ గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు ఆయిల్ల శ్రీనివాస్ బైక్‌ను ఎంపీడీవో కార్యాలయం వద్ద చెట్టు కింద పార్క్ చేసి సమ్మెలో పాల్గొన్నాడు. సాయంత్రం ఇంటికి బయలుదేరుదామని బైక్‌ను స్టార్ట్ చేశాడు. బైక్ సీటు కింది నుంచి పాడువాటి పాము బుసలు కొడుతూ తోకను ఆడిస్తూ కనిపించింది. దీంతో కంగుతిన్న అతడు హడలిపోయి బైక్‌ను వదిలి పరుగులు తీశాడు. అక్కడే సమ్మెలో ఉన్న తోటి కార్మికులు కట్టెతో పామును బయటకు లాగి కొట్టి చంపడంతో దేవుడా బతికిపోయానంటూ ఊపిరిపీల్చుకున్నారు.

పెద్దవాగులో దూకి మహిళ ఆత్మహత్య


సౌజన్య(ఫైల్)

దహెగాం: కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఐనం గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం.. ఐనం గ్రామానికి చెందిన చందన్‌కడే సౌజన్య (23)కు మూడు నెలల క్రితం సురేశ్‌తో వివాహమైంది. అయితే వారం రోజుల క్రితం కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి గ్రామంలో ఉంటున్న పెద్దమ్మ నాగడే సుశీల ఇంటికి వెళ్లింది. బుధవారం సౌజన్య కనిపించకపోవడంతో ఆమె భర్త సురేశ్‌కు సుశీల సమాచారం అందించింది. సౌజన్య కోసం సమీప బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. అందవెల్లి వాగు ఒడ్డున ఆమె పాదరక్షలు కనిపించడంతో అనుమానం వచ్చి వాగు తీరం వెంబడి వెతుకగా మండలంలోని ఇట్యాల పెద్దవాగు సమీపంలో గురువారం రాత్రి మృతదేహం కనిపించింది. కడుపు నొప్పి భరించలేకనే వాగులో దూకి ఆత్మహత్య చేసుకుందని భర్త సురేశ్ ఇచ్చిన ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

తగ్గుతున్న ఇంటర్ అడ్మిషన్లు

- ప్రభుత్వ కళాశాలల్లో మిగిలిపోతున్న సీట్లు
- ఉమ్మడి జిల్లాలోని 46 కాలేజీల్లో 7,447 విద్యార్థుల నమోదు
- గురుకులాలకు మొగ్గుచూపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు
- గురుకులాల్లో ప్రవేశాలు ఫుల్



నిర్మల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

నిర్మల్‌ఖిల్లా: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు తగ్గుతున్నాయి. ఏటేటా ప్రవేశాలు తగ్గుతూ వస్తున్నాయి. 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడిచినా ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. గురుకులాల నుంచే ప్రభుత్వ కళాశాలలకు పోటీ ఎదురవుతోంది. విద్యార్థులతో పాటు, తల్లిదండ్రులు కూడా గురుకులంలో చదువుకోవడమే మేలని భావిస్తున్నారు. దీంతో పదో తరగతి పూర్తికాగానే వివిధ కురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు ఏటా తగ్గుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 46 కాలేజీలు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 46ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అయితే జిల్లాలోని విద్యార్థులు ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో చేరేందుకు మొగ్గ చూపడం లేదు. తల్లిదండ్రులు కుదిరితే ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో చేర్పిస్తున్నారు. పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు ఆడపిల్లల్ని కేజీబీవీలలో చేర్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. బాలురను గురుకుల కళాశాలల్లో చేర్పిస్తున్నారు. దీంతో డేస్కాలర్ కళాశాలలుగా కొనసాగుతున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జరుగుతున్న అడ్మిషన్లు ఏటా తగ్గుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం అడ్మిషన్లు తగ్గినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

గురుకులాల్లో సౌకర్యాలు..

ప్రభుత్వ కళాశాలలతో పోలిస్తే గురుకుల కళాశాలల్లో సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని విద్యార్థులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. గుకుకులాల్లో పుస్తకాలతోపాటు భోజనం, వసతి కల్పిస్తున్నట్లు చెబుతున్నారు. డేస్కాలర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన హామీ ఏళ్లు గడుస్తున్నా అమలు కావడం లేదని పేర్కొంటున్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు అందిస్తున్నా.. అధ్యాపకుల కొరత, మధ్యాహ్న భోజనం లేకపోవడం, తరగతులు సక్రమంగా జరగకపోవడం, డేస్కార్ కాలేజీలకు ఉదయం వెళ్లి సాయంత్రం రావాల్సి ఉండడంతో చాలా మంది తల్లిదండ్రులు గురుకులాలవైపే మొగ్గ చూపుతున్నట్లు తెలుస్తోంది.

ఆలస్యంగా అడ్మిషన్లు..

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యంగా జరుగుతోంది. ఈలోపే ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల ప్రతినిధులు పిల్లల ఇంటికి వెళ్లి తమ కాలేజీల్లో చేర్పించుకుంటున్నారు. ఇక ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు అడ్మిషన్ల సమయంలో సప్లిమెంటరీ పరీక్షలు, పేపర్ మూల్యాంకన బాధ్యతల్లో ఉండి.. అవి అయిన తర్వాత ప్రవేశాలు కల్పిస్తున్నారు. అప్పటికే విద్యార్థులు ప్రైవేటు, గురుకులాల్లో చేరుతున్నారు.

గురుకులాల్లో ఎంసెట్, నీట్, ఐఐటీ శిక్షణ..

గురుకుల కళాశాలల్లో సెకండియర్ విద్యార్థులకు ఇంటర్ తర్వాత నిర్వహించే పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఇలాంటి సదుపాయం లేదు. సిలబస్ బోధించడం వరకే అధ్యాపకులు పరిమితమవుతున్నారు. గురుకులాల్లో అధ్యాపకులు రాత్రి వరకు అందుబాటులో ఉంటున్నారు. అనుమానాలు నివృత్తి చేసుకునే అవకాశం విద్యార్థులకు ఉంటుంది. డేస్కాలర్స్‌లో ఇలాంటి అవకాశం లేదు.

జూలై 12నాటికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అడ్మిషన్ల వివరాలు..

జిల్లా	కాలేజీల సంఖ్య	సాధారణ విద్యార్థులు	ఒకేషనల్ విద్యార్థులు	మొత్తం
ఆదిలాబాద్	13	2,281	423	2,704
నిర్మల్	12	1,652	285	1,937
కుమురంభీం	11	1,401	321	1,722
మంచిర్యాల	10	8,18	296	1,114
మొత్తం	46	6,152	1325	7,477




అడ్మిషన్ల కోసం ప్రచారం నిర్వహిస్తున్న జూనియర్ కళాశాల అధ్యాపకులు

అడ్మిషన్లు పెరిగేలా ప్రయత్నిస్తున్నాం...



ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లు పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. అడ్మిషన్లకు గడువున్నందున సంఖ్య పెరుగుతుందని ఆశిస్తున్నాం. పదో సప్లిమెంటరీ ఫలితాలు ఇటీవలే వెల్లడయ్యాయి. ట్రిపుల్ ఐటీ ప్రవేశాలు పూర్తి కాలేదు. దీంతో అడ్మిషన్ల కోసం ప్రయత్నిస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులు తమపిల్లల్ని గురుకులాల్లో జాయిన్ చేసేందుకు మొగ్గ చూపడం అడ్మిషన్లలో తగ్గుదలకు కారణం.

– పరశురాం జాదవ్, డీఐఈవో, నిర్మల్

ఈపీ ఆపరేటర్ల పదోన్నతుల కోసం పరీక్షలు


మాట్లాడుతున్న డీజీఎం అజయ్‌కుమార్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో శుక్రవారం బెల్లంపల్లి రీజియన్లకు సంబంధించిన ఈపీ ఆపరేటర్ల పదోన్నతుల కోసం అధికారులు పరీక్షలు నిర్వహించారు. రీజియన్ పరిధిలోని శ్రీరాంపూర్, బెల్లంపల్లి, మందమర్రి ఏరియాలకు చెందిన 36మంది ఈపీ ఆపరేటర్లు సీ గ్రేడ్ నుంచి బీ గ్రేడ్ పదోన్నతి కోసం పరీక్షలకు హాజరయ్యారు. కార్పొరేట్ డీజీఎం (పర్సనల్) కె.అజయ్‌కుమార్ పరీక్షల నిర్వహణను పరిశీలించి ఉద్యోగులకు పలు సూచనలు అందించారు. పరీక్షలకు సంబంధించిన మెరిట్ లిస్టును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌వో టూ జీఎం ఉమాకాంత్, పీవో సత్యనారాయణ, ప్రాజెక్టు ఇంజినీర్ రాజాజీ, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, డీవైపీఎం తిరుపతి, నాగుల వేణు, టీబీజీకేఎస్ నాయకులు మారిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మ్యాన్ రైడింగ్ పరిశీలించిన డీఎంఎస్


ఫిట్టర్‌ను అభినందిస్తున్న డీఎంఎస్ అరుముగమ్

శ్రీరాంపూర్: ఎస్సార్పీ 1 గనిలో మ్యాన్ రైడింగ్ సిస్టంను డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ(డీఎంఎస్) ఎం.అరుముగమ్ పరిశీలించారు. శుక్రవారం ఆయన ఏజెంట్ గోపాల్‌సింగ్‌తో కలిసి మ్యాన్ రైడింగ్ సిస్టం, దాని భద్రత, పనితీరును పరిశీలించారు. దీని నిర్వహణను భేష్‌గా చేసిన ఫిట్టర్ ఎనగందుల వెంకటనారాయణను డీఎంఎస్ అభినందించి రూ.వెయ్యి నగదు బహుమతి అందించి శాలువతో సత్కరించారు. తన సర్వీస్‌లో ఇప్పటివరకు సృజనాత్మకత ప్రదర్శించిన ఉద్యోగుల్లో వెంకటనారాయణ నాలుగో వ్యక్తి అని డీఎంఎస్ అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటూ జీఎం జీఎం రఘుకుమార్, ఏరియా సేఫ్టీ అధికారి శ్రీధర్‌రావు, ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ విజయకుమార్, గ్రూప్ ఇంజినీర్ సాంబశివరావు, సేఫ్టీ ఆఫీసర్ రాజేష్ బాబు, ఇంజినీర్ శంకరయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

శ్రమజీవుల గొంతుక.. గుండా మల్లేశ్


శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయికులు, కుటుంబీకులు

బెల్లంపల్లి: అమరజీవి మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ శ్రమ జీవుల గొంతుక, కార్మికుల ఉక్కుపిడికిలి అని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అన్నారు. గుండా మల్లేష్ 76వ జయంతి వేడుకలు శుక్రవారం పట్టణంలోని సింగరేణి కళావేదికలో ఘనంగా నిర్వహించారు. గుండా మల్లేష్ చారిటబుల్ ట్రస్ట్ లోగోను మాజీ మంత్రి బోడ జనార్దన్, మాజీ ఎమ్మెల్యేలు అమ్మరాజుల శ్రీదేవి, సొత్కు సంజీవరావు, రిటైర్డ్ సీబీ సీఐడీ అడిషనల్ ఎస్పీ పులియాల రవికుమార్, ఎంసీపీఐయూ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సబ్బని కృష్ణలతో కలిసి మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీని నిర్మాణం చేయడంలో మల్లేష్ ముఖ్యపాత్ర పోషించారన్నారు. ఆయన అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గర్జించే వారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గుండా మల్లేష్ భార్య సరోజ, కూతురు సమత, టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ కాంపెల్లి ఉదయ్‌కాంత్, కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు నాతరి స్వామి, తెలంగాణ అమరవీరుల లక్ష్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు రంజిత్, ఏఐవైఎఫ్ అధ్యక్షులు వలిఉల్లా ఖాద్రీ, సీపీఐ టౌన్ సెక్రటరీ దాసరి శ్రీధర్, మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బొల్లం పూర్ణిమ, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య, తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సొల్లు లక్ష్మి పాల్గొన్నారు.

కాసిపేట గనిలో కార్మికుడికి గాయాలు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేటగనిలో ప్రమాదవశాత్తు కిందపడిన సంఘటనలో ఇస్లావత్ రాజశేఖర్ అనే బదిలీ వర్కర్ కార్మికుడికి గాయాలు కాగా కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం మొదటి షిఫ్టులో గనిలో త్రీ సీమ్ ఆరవ ప్యానెల్ 20 లెవెల్‌లో నలుగురు వ్యక్తులు రోల్ మోసుకువెళ్తుండగా రాజశేఖర్ జారి పడటంతో రోల్ కిందపడి గాయాలయ్యాయి. అధికారులు అతడిని చికిత్స నిమిత్తం బిజోన్ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించడం జరిగిందని, ప్రస్తుతం ఎటువంటి ఇబ్బంది లేదని, ఆరోగ్యంగానే ఉన్నాడని ఈ సందర్భంగా గని సంక్షేమాధికారి జీశాన్ తెలిపారు.

గాలి అందక ఇబ్బందులు


కార్మికులతో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్: గనిలో గాలి సరఫరా సరిగా లేక తాము తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఆర్కే–7 గని కార్మికులు తెలిపారు. శుక్రవారం గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, జీఎం కమిటీ నాయకులు పెట్టం లక్ష్మణ్, కుమారస్వామి, బ్రాంచ్ కార్యదర్శి మహిపాల్‌రెడ్డి తదితరులు గనిని సందర్శించి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. భూగర్భంలోని 2ఏ సీంలో గాలి అందడం లేదన్నారు. దీంతో ఊపిరి ఆడక ఇబ్బంది పడుతున్నామన్నారు. మెటీరియల్ సరిగా అందకపోవడంతో పని స్థలాల్లో ఇబ్బంది పడుతున్నామన్నారు. కోల్ కట్టర్లకు డ్రిల్ బిట్లు, డ్రిల్‌రాడ్ల సరఫరా సరిగా లేదన్నారు. స్పేర్ పార్ట్స్ కూడా సరిగా రావడం లేదని, గాలిగోడలు కట్టడానికి ఫ్లైయాష్ ఇటుక కొరత ఉందని కార్మికులు తెలిపారు. అనంతరం నాయకులు గని ఇన్‌చార్జి మేనేజర్ రవిశంకర్‌ని కలిసి సమస్యలను వివరించారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చినట్టు టీబీజీకేఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిట్ సెక్రెటరీ వెంకటి, నాయకులు భూపతి అశోక్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత


కారుణ్య నియామక పత్రాలను అందిస్తున్న జీఎం

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో మెడికల్ ఇన్‌వ్యాలిడేట్ అయిన ఆరుగురు ఉద్యోగుల వారసులకు శుక్రవారం జీఎం దేవేందర్ కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కారుణ్య నియామకాల ద్వారా సంస్థలోకి అడుగుపెడుతున్న ఉద్యోగులు విధులకు గైర్హాజరు కాకుండా నిబద్ధతతో పని చేయాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సింగరేణిలో ఉద్యోగం దొరకడం అదృష్టంగా భావించాలన్నారు. సింగరేణి సంస్థ ఎదుగుదలకు కృషి చేయాలని, అధికారుల సూచనలు, ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించి ఉత్తమ ఉద్యోగులుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం తిరుమల్‌రావు, పీవో సత్యనారాయణ, డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, బీపీఏ ఓసీపీ–2 మేనేజర్ మహేష్ పాల్గొన్నారు.

సోలార్ శిక్షణకు గొల్లపల్లి సర్పంచ్


శిక్షణలో పాల్గొన్న సర్పంచ్, కార్యదర్శులు

నెన్నెల: గ్రామాల్లో పర్యావరణం, సమాజంపై ప్రభావం పడకుండా ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో 52 గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి హైదరాబాద్‌లో సోలార్ విద్యుత్‌పై శిక్షణ ఇస్తోంది. ఈ శిక్షణకు జిల్లా నుంచి రెండు పంచాయతీలు ఎంపిక కాగా మండలంలోని గొల్లపల్లి పంచాయతీ ఉంది. శుక్రవారం గొల్లపల్లి సర్పంచ్ ఇందూరి శశికళ, కార్యదర్శి రంజిత్ హైదరాబాద్‌లోని తెలంగాణ సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ శిక్షణలో పాల్గొన్నారు. విద్యుత్ వాడకాన్ని తగ్గించి కాలుష్యాన్ని అదుపులోకి తెచ్చి హరిత గ్రామాలుగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఇస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ప్రజలకు సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

స్వచ్ఛ ఆటో ఏమైంది..?


చెన్నూర్ మున్సిపాలిటీలోని స్వచ్ఛ ఆటోలు

- ఏడాదిగా కనిపించని ఆటో..
- రిపేరు కోసం తీసుకెళ్లారా.. మాయమైందా..?
- ఏడాదిగా పట్టించుకోని అధికారులు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ కోసం 16 స్వచ్ఛ ఆటోలను కొనుగోలు చేశారు. మున్సిపాలిటీలో 16 స్వచ్ఛ ఆటోలు ఉండాల్సి ఉండగా గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఒక్కొ స్వచ్ఛ ఆటో కన్పించకుండా పోయింది. 15ఆటోలు ఉండగా ఇందులో మూడు స్వచ్ఛ ఆటోలు మూలపడ్డాయి. ప్రస్తుతం 12 స్వచ్ఛ ఆటోలు మాత్రమే పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు వినియోగిస్తున్నారు.

రిపేరుకు వెళ్లిందా..?

ఆటో రిపేరు కోసం తీసుకుని వెళ్లితే పది రోజులు, నెల రోజుల్లో తీసుకొని రావాలి. గత ఏడాది ఫిబ్రవరి నుంచి మున్సిపాలిటీలో ఆ స్వచ్ఛ ఆటో కానరావడం లేదు. ఆటో రిపేరు కోసం పంపించి నేటికీ 17 నెలలవుతోంది. రిపేరు కోసం పంపించిన ఆటోను ఏడాదిన్నర కాలంగా రిపేరు షెడ్డులోనే ఉంచడం ఎంత వరకు సమంజసమని ప్రజలు పేర్కొంటున్నారు. మూడు నెలలకు ఓసారి జరిగే సాధారణ సమావేశాల్లో రిపేరు తీసుకొని వెళ్లిన ఆటో విషయాన్ని సభ్యులు ఎందుకు చర్చించడం లేదు. స్వచ్ఛ ఆటో కన్పించకపోవడంపై అధికారుల తీరుపట్ల అనుమానాలు కలుగుతున్నాయి.

పారిశుధ్య నిర్వహణ కోసం..

చెన్నూర్ మున్సిపాలిటీలో 18 వార్డులకు 16 స్వచ్ఛ ఆటోలు, రెండు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. 18 వాహనాలు సక్రమంగా నడిపిస్తేనే పట్టణ పరిశుభ్రత సాధ్యం. అసలే వర్షాకాలం నిత్యం వార్డుల్లో స్వచ్ఛ ఆటోలు వెళ్లి చెత్తను సేకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆటో వెళ్లకపోతే కాలనీ వాసులు చెత్తాను రోడ్లపై వేసే అవకాశం ఉంది. దీంతో చెత్తా కుళ్లి దుర్వాసనతో పాటు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం మున్సిపాలిటీలో 12 ఆటోలు, 2 ట్రాక్టర్లు మాత్రమే పనిచేస్తున్నాయి. మూలన పడిన మరో మూడు ఆటోలను రిపేరు చేయించి ఏడాదిగా కన్పించకుండా పోయిన ఆటోను తీసుకొని రావాల్సిన అవసరం అధికారులపై ఉంది.

మరమ్మతులకు పంపించినట్లు తెలుసు...

స్వచ్ఛ ఆటో వరంగల్‌కు రిపేరుకు పంపించారని చెప్పారు. స్వచ్ఛ ఆటో రిపేరు పంపించిన సమయంలో నేను ఇక్కడ లేను. నేను బాధ్యతలు చేపట్టిన తర్వత రిపేరు ఖర్చుల కోసం రూ.60వేల చెక్కును పంపించాను. చెక్ క్లియర్ అయిన తర్వత ఆటోను ఇస్తామన్నారు. ఆటోను త్వరలోనే తెప్పించేందుకు కృషి చేస్తా.

– గంగాధర్, మున్సిపల్ కమిషనర్, చెన్నూర్

అధికారులతో కార్మికుల వాదన

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిలో శుక్రవారం అధికారులు, కార్మికుల వాదనలతో పరిస్థితులు గందరగోళంగా మారాయి. గురువారం జరిగిన సంఘటనపై కోల్‌కట్టర్ కార్మికులు విధులు బహిష్కరించి మస్టర్లు పడకుండ ఉన్నారు. షిఫ్టు మార్పులు ఏమిటని అధికారులను ప్రశ్నించగా తమ చేతిలో లేదని ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చేసినట్లు తెలిపారు. మొదటి నుంచి ఈ సమస్యలపై ప్రశ్నిస్తున్న ఐఎన్‌టీయూసీ కార్మికులకు మద్దతు తెలపడంతో కార్మికులు విధులు బహిష్కరించారు. దీంతో ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేసే క్రమంలో ఓ అధికారి కార్మికుడిని తోసివేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. కార్మికులను ఒత్తిడికి గురిచేయడం, షిఫ్టు మార్చడం ఏమిటని వాదనకు దిగారు. దీంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారనుండటంతో గ్రూప్ ఏజెంట్ రాందాస్ అక్కడికి చేరుకుని కార్మికులు, యూనియన్‌ల నాయకులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించి గంటన్నర ఆలస్యంగా గనిలోకి దిగారు. ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్యలు ఈవిషయమై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుర్తింపు, ప్రాతినధ్య సంఘాల పేరుతో టీబీజీకేఎస్, ఏఐటీయూసీలు అధికారులతో కలిసి కట్టుగా పనిచేస్తున్నాయని విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ ఐఎన్‌టీయూసీ వెంట ఉండి పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా హెచ్చరించారు.

యునాని ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న యునాని ఆసుపత్రిని ఆయుష్ విభాగం వరంగల్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ రాథోడ్ రవినాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యునాని వైద్యుడు శంషుద్ జమాన్ గత మూడు నెలలుగా విధులకు సరిగా హాజరు కావడం లేదని తేలింది. మూడు నెలల్లో ఆరు రోజులు మాత్రమే విధులకు హాజరైనట్లు సదరు వైద్యుడు రిజిష్టర్‌లో సంతకం చేశాడు. అనుమతి, సమాచారం లేకుండా విధులకు డుమ్మా కొట్టడంతో విధుల నుంచి సస్పెండ్ చేయాలని ఆయుష్ రాష్ట్ర కమిషనర్‌కు సిఫారసు చేయనున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. వైద్యశాలలో రోగులకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు.

నేడు ఇన్‌స్పైర్ నామినేషన్లపై అవగాహన

మంచిర్యాలఅర్బన్: ఇన్‌స్పైర్ నామినేషన్ల నమోదుపై ఈ నెల 15న రాష్ట్ర విద్యా వైజ్ఞానిక పరిశోధన సంస్థ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులకు జూమ్ ద్వారా అవగాహన నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. మధ్యాహ్నం 2.15 ప్రారంభమయ్యే కార్యక్రమంలో రాష్ట్ర అధికారులు, పల్లె సృజన ఫౌండర్ బ్రిగేడియర్ గణేషన్‌లు పాల్గొంటారన్నారు. ప్రాజెక్టుల ఎంపికలో మెలకువల, విభిన్న వినూత్న అంశాలు, నూతన ఆవిష్కరణలు, సమస్యల పరిష్కారాలను కనిపెట్టి విధానాలను వివరిస్తారన్నారు.